రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు

సికింద్రాబాద్: పంద్రాగస్టును పురస్కరించుకొని జాగ్రత్త చర్యల్లో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.ఎస్. సరస్వత్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం నుంచే ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫామ్‌లు, వెయిటింగ్ హాల్స్, రైళ్లు, పార్సిల్ కార్యాలయాల్లో బ్యాగులు, సూట్ కేసులు తనిఖీలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, ఆర్పీఎఫ్ ఎస్ఐ వెంకట్ రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలసిన కాంగ్రెస్ నేతలు



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌తో కాంగ్రెస్ నాయకులు

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు దాసరి శ్యామ్‌సుందర్ నేతృత్వంలో బుధవారం పలువురు నాయకులు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాజీవ్ వికాస్ పథకం ద్వారా అర్హులైన ఎస్సీలకు పథకాలు వర్తింపజేయాలని కోరారు. అనంతరం శ్యామ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రీతమ్ సమక్షంలో బర్త్ డే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా శ్యామ్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పత్తికుమార్, కిరణ్‌యాదవ్, సంతోష్, శివ పలువురు నాయకులున్నారు.

12వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 31న కామారెడ్డిలో జరగనున్న బామ్‌సేఫ్ రాష్ట్రీయ మూల్ నివాసి సంఘ్ 12వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని విద్యార్థులు కోరారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట మహాసభల విజయవంతం కోసం రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఐఎల్‌పీపీ రాష్ట్ర అధ్యక్షులు పొన్నం దేవరాజ్‌గౌడ్ మాట్లాడుతూ.. నూతన విద్య విధానాన్ని రద్దు చేయాలని, ఓబీసీ కులగణన చేపట్టాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం నిర్వహించే మహాసభలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, బీవీఎం రాష్ట్ర కన్వీనర్ భూంపల్లి రవితేజ, ఓయూ విద్యార్థి నాయకులు శ్రీకాంత్, ప్రవీణ్, గణేశ్, పవన్, ప్రదీప్, నీలేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

సనత్‌నగర్: మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగాన్ని వ్యతిరేకిస్తూ బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. నిషా ముక్త్ భారత్ అభియాన్-2025లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిషేధించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాల గురించి తెలుసుకొని వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, డాక్టర్ జి.నర్సింహులు, సరిత, మధుకర్‌రావు, డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొట్టిన డీసీఎం

సనత్‌నగర్: నిర్లక్ష్యంగా డీసీఎం వాహనాన్ని నడిపిన వ్యక్తిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాణిగంజ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో కొండాపూర్ నుంచి సికింద్రాబాద్ వైపు వస్తుండగా, బేగంపేట సీటీఓ జంక్షన్ సిగ్నల్స్ వద్దకు రాగా వెనక నుంచి డీసీఎం డ్రైవర్ బస్సును ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ రాంచందర్‌కు గాయాలయ్యాయి. అలాగే బస్సు ముందుభాగం దెబ్బతింది. బాధితుడి ఫిర్యాదుతో బేగంపేట పోలీసులు డీసీఎం డ్రైవర్ హిందకుమార్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

గణేశ్ ఉత్సవాల ఏర్పాట్లపై సూచనలు పాటించాలి: జెడ్‌సీ రవికిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రవికిరణ్

సికింద్రాబాద్: గణేశ్ ఉత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాట్లపై సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో బుధవారం వివిధ విభాగాల అధికారులతో జోనల్ కమిషనర్ ఎన్. రవికిరణ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌సీ మాట్లాడుతూ.. గణపతి నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. అందుకోసం అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించినట్లు తెలిపారు. గణేశ్ నిమజ్జన సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గుంతలమయంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. ప్రస్తుత స్థితి, గత సంవత్సరం మిగిలిన పనులపై సమీక్ష చేసి కార్మికుల ఏర్పాట్లు, నీటిని నింపే ప్రణాళికలు, పోర్టబుల్ చెరువుల జాబితా పూర్తి చేయాలని ఆదేశించారు. క్రేన్ల విషయంలో గణేశ్ సంప్రదాయాలను తెలిసిన ఆపరేటర్లతో స్టాటిక్ క్రేన్లను, ఎస్‌హెచ్‌వో వారీగా మొబైల్ క్రేన్లను సీటీఓ సమన్వయం చేయాలని సూచించారు.

లైటింగ్ ఏర్పాటు చేయాలి

ఊరేగింపులు నిర్వహించే రోడ్డు మార్గాలతో పాటు తాత్కాలిక చెరువుల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎలక్ట్రికల్ విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా కొన్ని మార్గాల్లో చెట్ల కొమ్మలు తొలగించాలన్నారు. మొబైల్ టాయిలెట్లను క్లీనింగ్ ఏజెన్సీలకు కేటాయించి కాంటాక్ట్ నంబర్లతో బ్యానర్లు ప్రదర్శించడం, ప్రసాదం, తాగు నీటి పాయింట్ల వద్ద వ్యర్థాల డ్రమ్ములు ఉండేలా చూడాలన్నారు. రామ్‌కీ అదనపు వాహనాలు 24 గంటలు పనిచేయడం, గణేశ్ మండపాల విషయంలో కార్యకర్తల కాంటాక్ట్ నంబర్లను పోలీసులకు, డీసీలకు అందజేయాలన్నారు. మండపాల వద్ద సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు ఇతరులపై ఆహారం లేదా నీటి ప్యాకెట్లు వేయకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పేపర్ షాట్స్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ సి. వెంకట గోపాల్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్‌రాజు, కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ పల్లవి విజయవంశీ, ఎస్ఈ ఆశలత, సిటీ ప్లానర్ శ్రీనివాస్, హార్టికల్చర్ డీడీ అనిల్, జోనల్ సీటీఓ శ్రీనివాస్, డీసీలు మంజులా రెడ్డి, మారుతి దివాకర్, జకియా సుల్తానా, అంజనేయులు, దాకు నాయక్, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యదర్శి బుచ్చిరెడ్డి, మురారి, రాహుల్ స్వగత్, రుత్విక్, దాస్, తదితరులు పాల్గొన్నారు.

గైడ్‌లైన్స్‌ను తప్పకుండా పాటించాలి

బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి

సనత్‌నగర్: నిర్దేశిత గైడ్‌లైన్స్‌ను వినాయక మండపాల నిర్వాహకులు పాటించి తీరాలని బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి అన్నారు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో బుధవారం ఎర్రగడ్డ విక్టోరియా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఏసీపీ మాట్లాడుతూ.. వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన, ఊరేగింపునకు సంబంధించి పోలీస్‌స్టేషన్ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాలను రహదారులకు అడ్డుగా లేకుండా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. లౌడ్ స్పీకర్లను ఉదయం



మాట్లాడుతున్న బాలానగర్ ఏసీపీ

6 నుంచి రాత్రి 10 వరకు మాత్రమే ఉపయోగించాలన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఊరేగింపులకు సంబంధించి మార్గాలను పోలీసులు సూచించిన విధంగా పాటించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేస్తారని, నిర్వాహకులు పోలీసులకు సహకరించాలన్నారు. మండపాల ఏర్పాటుకు, ఊరేగింపులకు సంబంధించి అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సౌకర్యం కూడా ఉందన్నారు. నిమజ్జన ఉత్సవ సమయంలో, మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదన్నారు. నిబంధనలు బేఖాతర్ చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. మండపాల వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నా వారి గురించి సమాచారం పోలీసులకు అందించాలన్నారు. మండపాల నిర్వాహకులు మార్గదర్శకాలను పాటిస్తూ వినాయక చవితి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుతో పాటు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



సనత్‌నగర్: భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మూడు, నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిందని, అత్యవసరమైతే తప్ప ఇళ్లల్లో నుంచి బయటకు రావొద్దని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, తీగలు తెగిపడడం, వరద నీరు నిలిచిపోవడం, చెట్లు కూలిపోవడం వంటి అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్ 21111111, ఫోన్ నంబర్ 040-23225397లకు ఫిర్యాదు చేయాలన్నారు. రోడ్లపై నీటితో నిండిన గుంతల్లో జారీపడే అవకాశాలు ఉన్నందున వాహనదారులు కూడా డ్రైవింగ్‌లో జాగ్రత్తగా వ్యవహరించాలని వివరించారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్, శానిటేషన్ తదితర అన్ని శాఖల అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరుపుతూ ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులపై సంబంధిత క్షేత్రస్థాయిలోని అధికారులకు తక్షణ చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రధాన రోడ్లతో పాటు కాలనీలు, బస్తీల్లో ఎక్కడా వర్షపునీరు నిల్వ ఉండకుండా సాఫీగా నీటి ప్రవాహం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నూతన కరెంట్ స్తంభం ఏర్పాటు

మూడు నెలల పెండింగ్ సమస్యకు పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..

లాలాపేట: తార్నాక సండే మార్కెట్ నాగార్జున నగర్ కమ్యూనిటీ హాల్ పక్కన ఉన్న కరెంట్ స్తంభం ఒక వైపుకు ఒంగిపోయి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. ఈ నెల 12న 'సాక్షి' దినపత్రికలో ఒరిగిన కరెంట్ స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్ అధికారులు స్పందించారు. బుధవారం విద్యుత్ అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకొని చర్యలు తీసుకున్నారు. ఒరిగిన స్తంభాన్ని తొలగించి, నూతన కరెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు మూడు నెలల క్రితం నుంచి ఉన్న ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదు. కానీ సాక్షి దినపత్రిక ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసినందుకు తార్నాక వాసులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు స్థానికులు, బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న తెలియజేశారు.



ఏర్పాటు చేసిన నూతన కరెంట్ స్తంభం

నేడు తుకారాంగేట్‌లో టీయూజేఏసీ సమావేశం

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం సమీపంలో గురువారం నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయాలని టీయూజేఏసీ చైర్మన్ ఎస్. యాదగిరి ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల భవిష్యత్ కార్యాచరణ, రాబోయే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఉద్యమకారుల పాత్ర గురించి చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: రోడ్డు ప్రమాదాల నివారణ మన అందరి బాధ్యత అని ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. యువత ఎక్కువగా ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంప్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారని, రోడ్డు ప్రమాదాల నివారణ అనేది మన అందరి బాధ్యత అని గుర్తించుకోవాలని సూచించారు. చాలా మంది డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా డ్రైవింగ్ చేస్తున్నారని, అలా చేయడం వల్ల జరిమానా విధించడంతో పాటు జైలు శిక్ష పడే అవకాశాలున్నాయని హెచ్చరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలని సూచించారు. వాహనం నడిపే వారితో పాటు వెనక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని అన్నారు. ముఖ్యంగా ఇటీవల యువత డ్రగ్స్ లాంటి మహమ్మారి బారిన పడి తమ జీవితాలను నాశనం చేసికుంటున్నారని, బంగారు భవిష్యత్ ఉండే యువత ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ జ్ఞానారెడ్డి, ఏసీపీ శంకర్‌రాజు, గోపాలపురం, టీటీఐ ఇన్‌స్పెక్టర్లు జుట్టు భాస్కర్, నాగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డీసీపీ

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు రూర.., కిలోల్లో టమాటా 37, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 55, క్యాప్సికం 40, పచ్చకాకర 26, పందిరి బీర 38, క్యాబేజీ 13, క్యారెట్ 45, దొండ 23, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 50, గోకరకాయ 28, కీర 18.

అమరులను స్మరించుకుందాం



సీతాఫల్‌మండిలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్



ర్యాలీ ప్రారంభిస్తున్న బండారు దత్తాత్రేయ

సికింద్రాబాద్: ప్రాణాలను త్యాగం చేసిన అమరులను స్మరించుకుందామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సీతాఫల్‌మండిలో డివిజన్ అధ్యక్షుడు ఈవీ నరేశ్ ఆధ్వర్యంలో బుధవారం శివాజీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు, వివిధ స్కూళ్లలోని విద్యార్థులు జాతి సమైక్యత, దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన జిల్లా పార్టీ అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సారంగపాణి హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, నాగేశ్వర్ రెడ్డి, అంబాల రాజేశ్వరరావు, ప్రభుగుప్తా, వెంకటేష్ గౌడ్, సురేష్ ముదిరాజ్, సతీష్ ముదిరాజ్, హనుమంతు ముదిరాజ్, కరుణాకర్, శ్రీధర్‌రావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో..

అడ్డగుట్ట: హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అడ్డగుట్ట డివిజన్‌లో యువ మోర్చా అధ్యక్షుడు ఉదయ్ యాదవ్ ఆధ్వర్యంలో తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను పట్టుకొని అడ్డగుట్ట ప్రధాన రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షురాలు సౌందర్య, ప్రధాన కార్యదర్శి హరి శివప్రసాద్, రాజు, చిరంజీవి, కృష్ణ, సాయి, శివాజీ, లోకేశ్, మహేందర్, నాయకులు కళావతి, ప్రేమలత, వసంత, రాములమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వీరుల త్యాగాలతోనే స్వాతంత్ర్యం

రాంగోపాల్‌పేట్: ఎందరో వీరుల త్యాగాలతో మనకు స్వాతంత్ర్యం వచ్చిందని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బుధవారం బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది రవీందర్ ఆధ్వర్యంలో చేపట్టిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామం గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఈ ర్యాలీ సికింద్రాబాద్ వెస్లీ కళాశాల నుంచి నల్లగుట్ట, సుభాష్‌రోడ్, మహంకాళి టెంపుల్, కళాసీగూడ నుంచి గాంధీ విగ్రహం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సరళ, కొంతం దీపిక, శ్రవణ్, అనిష్‌వర్మ పాల్గొన్నారు.

గొడుగులు, సబ్సిడీ ఆటోల పంపిణీ

సనత్‌నగర్: ప్రభుత్వం నుంచి మంజూరైన సబ్సిడీ ఆటోలను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ హాజరై సబ్సిడీ ఆటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదలను ఆర్థికంగా నిలబెట్టడం కోసమే ప్రభుత్వం సబ్సిడీతో కూడిన ఆటోలను పంపిణీ చేస్తోందన్నారు. మంజూరైన ఆటోలతో ఆయా కుటుంబాల్లో ఆర్థిక ప్రగతి ఉంటుందన్నారు. మరోవైపు సనత్‌నగర్, అమీర్‌పేట్, బన్సీలాల్‌పేట ప్రాంతాల్లో చిరువ్యాపారమే జీవనాధారంగా కుటుంబాలను పోషించుకుంటున్న చిరు వ్యాపారులకు ఎండకు, వానకు రక్షణగా ఉచితంగా గొడుగులు పంపిణీ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా ఉండేలా గొడుగులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో అన్ని డివిజన్ల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గొల్లకురుమల సమస్యలను పరిష్కరించండి



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న సంఘం నాయకులు

లాలాపేట: రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం నాయకులు బుధవారం సెక్రటేరియట్‌లో తెలంగాణ ఎస్సీ ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణలోని గొల్లకురుమలు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాడి పశువులను, గొర్రెలను అడవిలో మేతకు తీసుకెళ్లటకు హక్కులు కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెలు, మేకలు, పశువులకు నష్టపరిహారం ఇవ్వాలని మంత్రిని కోరారు. 50 ఏళ్లు దాటిన కాపరులకు రూ. 5 వేలు పింఛన్, ప్రమాద బీమా రూ.15 లక్షలు ఇవ్వాలన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి మీ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొమ్ము అశోక్ యాదవ్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు హరిబాబు యాదవ్, రమేశ్‌యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

జేబీఎస్‌ను మోడల్ బస్ స్టేషన్‌గా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే శ్రీగణేశ్



జేబీఎస్ ఆవరణలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: జూబ్లీ బస్‌స్టేషన్ (జేబీఎస్)ను మోడల్ బస్‌స్టేషన్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బుధవారం జూబ్లీ బస్ స్టేషన్, డిపో, కంటోన్మెంట్ బస్ డిపోల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా డిపో అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు, పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా బస్‌స్టేషన్‌లోకి వచ్చే బస్సులు మెయిన్ గేటులో ఆపి ప్రయాణికులను దించడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతుందని తెలిపారు. సమీపంలోని కంటోన్మెంట్ బోర్డు స్థలాన్ని కొంత ఇప్పిస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అధికారులు చెప్పారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే కంటోన్మెంట్ సీఈఓతో ఫోన్లో మాట్లాడి సమస్యను వివరించారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పానికి మహిళా శక్తి పథకం ద్వారా కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మహిళలకు బస్సులను ఇప్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అదనపు బస్సులు అవసరమైతే తన దృష్టికి తీసుకొస్తే మహిళా సంఘాలతో బస్సులు కొనుగోలు చేయించి అందిస్తామన్నారు. జూబ్లీ బస్ స్టేషన్‌ను మోడల్ బస్‌స్టేషన్‌గా తీర్చి దిద్దడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఎమ్మెల్యే వెంట కంటోన్మెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

క్రమశిక్షణ, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి



బదిలీ అయిన సిబ్బందిని సన్మానిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

చిలకలగూడ: పోలీసుల ప్రతిష్ఠను మరింత పెంపొందించేలా క్రమశిక్షణ, చిత్తశుద్ధితో వారు విధులు నిర్వర్తించాలని చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్ సూచించారు. చిలకలగూడ ఠాణా నుంచి వివిధ పోలీస్‌స్టేషన్లకు బదిలీ అయిన ఏఎస్ఐ, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళ్లకు ఠాణా ప్రాంగణంలో బుధవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలతో మమేకమై, బాధితులకు అండగా ఉన్నామనే భరోసా ప్రజల్లో కల్పించేలా విధులు నిర్వహించాలని సూచించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌గౌడ్, అడ్మిన్ ఎస్ఐ ఆంజనేయులు, డీఎస్ఐ రాకేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.